

# భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఐఆర్ఎస్ అధికారి రవితేజ

### కుటుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లించుకున్న అధికారి

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ భీమేశ్వర స్వామి వారిని ఐఆర్ఎస్ అధికారి శ్రీ దూలం రవితేజ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వరంగల్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన ఈయన ప్రస్తుతం ఢిల్లీలోని ఇండియన్ పార్లమెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆలయానికి చేరుకున్న రవితేజకు అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కు కోడెను కట్టారు. దర్శనానంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. స్వామివారిని దర్శించుకోవడం పట్ల రవితేజ గారు సంతోషం వ్యక్తం చేశారు.

# ముంబై-పూణె ఎక్స్‌ప్రెస్‌వేలో ట్రాఫిక్ జామ్

### 1.2 లక్షల మంది ప్రయాణికులకు రూ. 5.2 కోట్ల టోల్ ట్యాక్స్ వాపసు

**ప్రజా నావ, ముంబై:** ఫిబ్రవరి 3న జరిగిన గ్యాస్ ట్యాంకర్ పడి పోవడం వలన ముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వేలో దాదాపు 32 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలో ప్రభావితమైన కనీసం 1.2 లక్షల మంది వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది. ఈ వాహనదారులందరికీ త్వరలో టోల్ వాపసు లభిస్తుంది. మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ అధికారుల ప్రకారం, ఈ వాహనదారులందరికి మొత్తం రూ. 5.16 కోట్ల వాపసు లభిస్తుంది. ముంబై -పూణే ఎక్స్‌ప్రెస్‌వే మరియు పూణే-బెంగళూరు జాతీయ రహదారిపై వసూలు చేసిన టోల్‌పై కూడా ఈ వాపసు వర్తిస్తుంది. ఈ ట్రాఫిక్ జామ్ తర్వాత టోల్ వసూలు ఆపాలని సూచనలు జారీ చేసినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. అయితే, నిధులు తగ్గించబడిన ఫాస్ట్‌ట్యాగ్‌ల వాహనాల డేటాను సేకరించారు. ఈ మొత్తాన్ని రాబోయే వారంలో సంబంధిత డ్రైవర్ల ఫాస్ట్‌ట్యాగ్ ఖాతాలకు జమ చేస్తారు.

#### తిరిగి చెల్లింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది

ఈ సంఘటన తర్వాత, కార్పొరేషన్ తన రాయితీదారు ఐఆర్బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుండి వివరణ కోరింది. అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం, టోల్ ప్లాజా అడ్డంకులు పూర్తిగా తెరవబడే వరకు, కొన్ని లావాదేవీలలో ఫాస్ట్‌ట్యాగ్‌లను ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా తగ్గించడం జరిగింది. అటువంటి అన్ని కేసులను గుర్తించి, వాపసు ప్రక్రియ ప్రారంభించబడతుంది. వాపసు నేరుగా డిజిటల్ మార్గాల ద్వారా చేయబడుతుంది.

#### వాపసు ప్రాధాన్యత

ఫిబ్రవరి 3న ఖోపోలి సమీపంలో జరిగిన గ్యాస్ ట్యాంకర్ ప్రమాదం తర్వాత ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది వాహనాలు 40 నుండి 50 కిలోమీటర్ల వరకు క్యూలో నిలిచాయి. చాలా మంది ప్రయాణీకులకు గంటల తరబడి నీరు లేదా ఆహారం లభించలేదు. సమీపంలో టాయిలెట్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, టోల్ వసూలును తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.అయినా కొంత మంది వాహనదారుల నుండి టోల్ ట్యాక్స్ వసూలు చేయడం జరిగింది.

# డబ్బు కోసం కన్నకూతుళ్లనే.. వ్యభిచారంలోకి దింపిన తండ్రి!

### పోలీసుల దాడిలో ఇద్దరు మైనర్ల రక్షణ

### బ్రోకర్ అరెస్ట్.. పరారీలో కీచక తండ్రి



**ప్రజానావ, ముంబై:** రక్త సంబంధాలకే మాయని మచ్చ తెచ్చేలా, కేవలం డబ్బు కోసం కన్న తండ్రే తన ఇద్దరు మైనర్ కుమార్తెలను వ్యభిచార కూపంలోకి నెట్టిన అమానుష సంఘటన నవీ ముంబైలో కలకలం రేపింది. కోపర్ ఖైరానే ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తి, తన 16 ఏళ్ల, 14 ఏళ్ల కుమార్తెలను ఒక బ్రోకర్ ద్వారా విక్రయించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నవీ ముంబై పోలీసులకు చెందిన అనైతిక మానవ అక్రమ రవాణా నివారణ విభాగానికి (ఏహెచ్‌టీయూ) అందిన రహస్య సమాచారం ప్రకారం.. కొంతమంది బాలికలతో బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నట్లు తెలిసింది. సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్ ఘోర్పడే నేతృత్వంలో పోలీసులు నకిలీ కస్టమర్లుగా అవతారమెత్తి బ్రోకర్‌ను సంప్రదించారు. ఒక్కో అమ్మాయికి రూ. 1.5 లక్షల వరకు డీల్ కుదుర్చుకున్నారు.

#### రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ బ్రోకర్

ఫిబ్రవరి 20 రాత్రి బేలాపూర్‌లోని 'కే స్టార్' హోటల్ సమీపంలో లావాదేవీని ఖరారు చేశారు. బ్రోకర్ హరీష్ వికాస్ చారి (27) బాలికలతో అక్కడికి చేరుకోగానే, మఫ్టీలో ఉన్న పోలీసులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. ఇద్దరు బాలికలను సురక్షితంగా రక్షించి విచారించగా, షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమ తండ్రే డబ్బు ఆశతో బ్రోకర్‌కు తమను అప్పగించాడని బాలికలు వాపోయారు.

#### కేసు నమోదు - దర్యాప్తు

ఈ ఘటనపై పోలీసులు అనైతిక అక్రమ రవాణా నిరోధక చట్టం (పీఐటీఏ), పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బ్రోకర్ హరీష్ పోలీసుల కస్టడీలో ఉండగా, పరారీలో ఉన్న కీచక తండ్రి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# అక్రమ అరెస్టులకు భయపడం

- ఫిలింనగర్‌లో బీజేపీ శ్రేణుల నిరసన
- ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, రాంచందర్ రావు అరెస్టుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో ఆందోళన



**ప్రజానావ, ఖైరతాబాద్:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అక్రమ అరెస్టులను నిరసిస్తూ రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫిలింనగర్ డివిజన్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రహదారిపై మానవహారంగా ఏర్పడి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు. ఇలాంటి బెదిరింపులకు బీజేపీ భయపడదని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు గందె అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శులు దొంగరి రాజకళ, గుంటి ఆనంద్ సాగర్, ఉపాధ్యక్షులు వలిశెట్టి రాంబాబు, మహిళా మోర్చా అధ్యక్షురాలు గొల్లి రమ్య, యువమోర్చా అధ్యక్షులు మంజలి నరసింహా, ప్రధాన కార్యదర్శి హరీష్ ముదిరాజు, పోలింగ్ బూత్ అధ్యక్షులు హనుమంతు ముదిరాజు, భీమేష్ యాదవ్, మహిళా నాయకులు సుజాతక్క, పద్మ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో భక్తుల సందడి

- ఒకే రోజు 59,796 మంది దర్శనం



**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ భీమేశ్వర స్వామి వారి సన్నిధి సోమవారం భక్తులతో పోటెత్తింది. వారం ప్రారంభం కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారికి ఎంతో ఇష్టమైన కోడె మొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు మరియు కుంకుమ పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. సోమవారం



ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 59,796 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 4,855 కోడె మొక్కులు నమోదైనట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల నిర్వహణ, దర్శన సౌకర్యాలు, ప్రసాద పంపిణీలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్న అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి వారిని దర్శించుకుని పునీతులయ్యారు.

# ప్రజావాణితో సమస్యల పరిష్కారం

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

### 154 దరఖాస్తుల రాక



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 154 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు పంపారు. ముందుగా గత ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 72, గృహ నిర్మాణ శాఖకు 17, జిల్లా పంచాయతీ అధికారికి 15, డీఆర్డీఓకు 8, జిల్లా సంక్షేమ శాఖకు 7, ఎండీ సెస్ కు 6, ఎస్డీసీకి 5, జిల్లా విద్యాధికారి, ఉపాధి కల్పన అధికారికి 4 చొప్పున, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా వైద్యాధికారికి మూడు చొప్పున, ఎస్పీ కార్యాలయానికి 2, జిల్లా అటవీశాఖ అధికారి, జిల్లా ఎక్సైజ్ శాఖ, జిల్లా ట్రెజరీ శాఖ, పశు సంవర్ధక శాఖ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, సిరిసిల్ల, ఎంపీడీఓ ఎల్లారెడ్డిపేట, డీఎం ఆర్టీసీ సిరిసిల్లకు ఒకటి చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

### 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాల పంపిణీ



**ప్రజానావ, సిరిసిల్ల :** లైసెన్సుడు సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో సోమవారం 25 మంది సర్వేయర్లకు లైసెన్స్ పత్రాలు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకొని, పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన జిల్లాకు చెందిన 66 మంది సర్వేయర్లకు లైసెన్సులు గతంలో అందజేసిందని గుర్తు చేశారు. గత ఏడాది జిల్లాకు చెందిన సివిల్ విభాగంలో ఉత్తీర్ణత సాధించిన వారికి 50 రోజుల పాటు శిక్షణ ప్రభుత్వం అందించిందని, వారిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో పాస్ అయిన 25 మందికి లైసెన్స్ పత్రాలను అందించామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. లైసెన్స్ పొందిన వారు అందరూ వారికి కేటాయించిన మండలాల్లో అందుబాటులో ఉండాలని, ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, నటరాజ్ సిబ్బంది ఉన్నారు.

